వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 069
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
ఫిబ్రవరి 24, 2026

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం



2లో..

# ఫ్యూచర్ సిటీపై ఉన్న ధ్యాస..
# పేదలకు ప్రాణంపోసే హెల్త్ సిటీపై లేదు



- మాజీ మంత్రి హరీష్ రావు
- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సందర్శన
- పనులు నత్తనడకన సాగడంపై సీరియస్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రేవంత్ రెడ్డికి కమీషన్లు తెచ్చే రియల్ ఎస్టేట్ ఫ్యూచర్ సిటీ మీద ఉన్న ధ్యాస.. పేదలకు ప్రాణం పోసే వరంగల్ 'హెల్త్ సిటీ' మీద లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ హరీష్ రావుఆరోపించారు. వెంటనే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రారంభించకపోతే.. బీఆర్ఎస్ పక్షాన వరంగల్ గడ్డపైనే నిరాహారదీక్షకు దిగుతామని హెచ్చరించారు. (మిగతా 8లో..)

## అభివృద్ధి పనులు శూన్యం..
## అసత్య ప్రచారాల్లో ప్రథమం



2లో..

- పదేళ్లలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని



## పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్, 10వ తరగతి పబ్లిక్ పరీక్షల పక్కద్బందీ నిర్వహణపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, కృష్ణ ఆదిత్య, నికోలస్ తదితర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లలతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద పాల్గొన్నారు.

–వరంగల్ వాయిస్, వరంగల్




8లో..

## డెస్క్ జర్నలిస్టుల ఆందోళన

 కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన నాయకులు






- భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి
- అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్
- గోదావరి తీరంలోని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమీక్ష

# సిద్ధం కండి..

## వచ్చే యేడు గోదావరి పుష్కరాలు



వివరాలు2లో..

వచ్చే యేడు జూన్ 26 నుంచి జూలై 7 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గోదావరి నది తీరంలోని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో గోదావరి పుష్కర ఏర్పాట్లపై సమీక్షించారు. 12 సంవత్సరాలకు ఒకసారి గురువు సింహరాశిలోకి ప్రవేశించినప్పుడు ఈ పవిత్ర ఉత్సవం నిర్వహిస్తారు. రాష్ట్రంలోని బాసర, ధర్మపురి, కాళేశ్వరం, భద్రాచలంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి వంటి ముఖ్య క్షేత్రాలలో భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి, పితృ తర్పణాలు వదులుతారు. గోదావరి పుణ్య స్నానాలు చేసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున సంబంధిత ఏర్పాట్లపై పూర్తి స్థాయిలో నివేదికలు తయారు చేసి సమర్పించాలని శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. పుష్కర స్నానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య శిబిరాల ఏర్పాటు, గజ ఈతగాళ్ల ఏర్పాటు, బందోబస్తు ఇతర పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించే దిశగా ప్రతిపాదనలు రూపొందించాలన్నారు.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి



# సిద్ధం కండి..

## వచ్చే యేడు గోదావరి పుష్కరాలు

- భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి
- అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్
- గోదావరి తీరంలోని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమీక్ష

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** పుష్కర సమయంలో నదీ స్నానం పాప విముక్తిని, పితృ దేవతలకు తృప్తిని కలిగిస్తుందని హిందువుల విశ్వాసం. అందుకే వచ్చే యేడు జూన్ 26 నుంచి జూలై 7 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. 12 సంవత్సరాలకు ఒకసారి గురువు సింహరాశిలోకి ప్రవేశించినప్పుడు ఈ పవిత్ర ఉత్సవం నిర్వహిస్తారు. దీనిని మహా పుష్కరం అని కూడా పిలుస్తారు. ఈ మేరకు రాష్ట్రంలోని గోదావరి నది తీరంలో జరగనున్న పుష్కరాల సంబంధిత ఏర్పాట్లపై పూర్తి స్థాయిలో నివేదికలు తయారు చేసి సమర్పించాలని ఆమె కోరారు. పుష్కర స్నానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య శిబిరాల ఏర్పాటు, గజ ఈతగాళ్ల ఏర్పాటు, బందోబస్తు ఇతర పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించే దిశగా ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. మంచిర్యాల జిల్లాలో గోదావరి పుష్కరాలు నిర్వహించడానికి చేయవలసిన ఏర్పాట్లను, సంబంధించిన అంశాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

### సుమారు 370 పైగా ఘాట్లు..

12 రోజుల పాటు నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు నది పరీవాహక ప్రాంతంలో సుమారు 370కి పైగా ఘాట్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలోని బాసర, ధర్మపురి, కాళేశ్వరం, మంథని, కోటిలింగాల, భద్రాచలం, ఏటూరునాగారంతోపాటు పలు ప్రాంతాల్లో ఘాట్ల ఏర్పాటుకు అన్ని చర్యలు చేపట్టారు. ములుగు జిల్లాలో మొత్తం నాలుగు పుష్కర ఘాట్లలను మంగపేట, ముళ్ళ కట్ట, రామన్నగూడెం, కన్నాయిగూడెం పుష్కర ఘాట్ లను సిద్ధం చేస్తున్నారు. అయితే పుష్కరాల్లో మొదటి 12 రోజులని 'ఆది పుష్కరాలు' అని, చివరి 12 రోజులని 'అంత్య పుష్కరాలు' అని అంటారు. అది పుష్కరాల్లోనే భక్తులు అధిక సంఖ్యలో పుణ్య స్నానాలు ఆచరించనున్నారు.

# అభివృద్ధి పనులు శూన్యం..

- అసత్య ప్రచారాల్లో ప్రథమం
- పదేళ్లలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీఆర్ఎస్ గత పదేళ్లలో చేసిందేమీ లేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. డబ్బు కోసం చేసే రాజకీయాలకే బీఆర్ఎస్ పరిమితమైందని విమర్ఇంచారు. పదేళ్ల పాలనలో అభివృద్ధిని కుంటుపడేసి, ఇప్పుడు విమర్శలనే ఆయుధంగా చేసుకుని జిల్లాల్లో జెమిని సర్కస్ మాదిరిగా పర్యటనలు చేస్తున్నారని ఆయన అన్నారు. చేసిన పనులు లేకపోవడంతో రోజువారీ ఆరోపణలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. మూడు రోజులుగా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం సమగ్రంగా ఆలోచిస్తోందని పదేళ్లలో చేయలేని వారు ఇప్పుడు పరిశీలన పేరుతో మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. దాదాపు పూర్తికావొచ్చిన దవాఖానను బయట నుంచే చూసి విమర్శలు చేయడం తగదన్నారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి ఆధునిక పరికరాలు విదేశాల నుంచి రానున్నందున కొంత జాప్యం సహజమని వివరించారు. వరంగల్ మాజీ నేతలకు ఎమ్మెల్యే సూటి ప్రశ్నలు సంధించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను విభజించినప్పుడు కానీ, నిధుల కేటాయింపుల విషయంలో కానీ మీ నాయకులను ఎప్పుడైనా ప్రశ్నించారా? మీ కాలంలో జరిగిన అభివృద్ధి ఎంత, గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధి ఎంత అనే అంశంపై చర్చకు సిద్ధమా? అని నాయిని సవాల్ విసిరారు. బినామీ పేర్లతో కోట్ల రూపాయలు కూడబెట్టిన నేతలు ఇప్పుడు పారదర్శకతపై మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. టెక్స్ టైల్ పేరుతో అట్టహాసంగా ప్రకటించిన ప్రాజెక్టులు భూమి దశ దాటలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గణనీయమైన అభివృద్ధి జరుగుతోందని, రెండున్నరేళ్లలో తీసుకొచ్చిన పనులు ఎటువంటి అవకతవకలు లేకుండా సాగుతున్నాయని తెలిపారు. కాంట్రాక్టర్లపై కమిషన్ల ఒత్తిడి లేదన్నారు. "సలహాలు ఉంటే ఇవ్వండి. ఎన్నికలప్పుడు రాజకీయాలు చేద్దాం.. కానీ దాడుల రాజకీయాలను నేను ఎప్పుడూ ప్రోత్సహించలేదు" అని అన్నారు. పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానని, ఎన్నికల సమయంలో తప్పకుండా వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని, మీ ఓటు హక్కు వినియోగించుకోలేని పక్షంలో గూండాలు రౌడీలు రాజ్యమేలుతారని, చదువుకున్న విజ్ఞానవంతులుగా మీరు సరైన సమయంలో రానున్న ఎన్నికల్లో నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. ప్రజల తీర్పే తుది తీర్పు అని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబెర్ పల్లకొండ సతీష్, ఆలయ కమిటీ డైరెక్టర్ సతీష్, బ్లాక్ అధ్యక్షులు బంక సంపత్, లక్ష్మారెడ్డి, నాయకులు నలుబోల సతీష్, సుగుణాకర్ రెడ్డి, తడుక సుమన్, పున్నం, నాగరాజు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం

**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ భక్తబృందం ఆధ్వర్యంలో జనగామ పట్టణ కేంద్రంలో ఉన్నటువంటి 11 దేవాలయాలలో 11 మంగళవారాలు చొప్పున 11 సార్లు మొత్తం 11,116 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేసి నేడు జనగామ పట్టణంలోని వెంకన్న కుంటలోని పంచముఖ హనుమాన్ దేవాలయంలో ఉద్యాపన కార్యక్రమాన్ని నిర్వాహకులు పజ్జూరి శారద లక్ష్మీ నరసయ్య, మాదారపు కల్పన సత్యనారాయణ దంపతులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 250 మంది భక్తులు పాల్గొని సామూహిక హనుమాన్ చాలీసా భక్తి ప్రపత్తులతో పారాయణం చేశారు. తదనంతరం కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం పట్టణంలోని మహిళలంతా ధార్మిక కార్యక్రమాలలో సత్సంగాలలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరుతూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

# ఎన్ఆర్ఐల భారీ విరాళం

- కేఎంసీలో మౌలిక సదుపాయాలకు రూ.10 కోట్లు
- అభినందించిన ఎమ్మెల్యే నాయిని

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్వదేశం పట్ల మమకారం, పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలనే సంకల్పంతో ఎన్ఆర్ఐల బృందం ముందుకు వచ్చిందని ఎవరంగల్ పశ్చిమ మ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నాయినితోపాటు ఎన్నారై డాక్టర్ సుజీత్ కుమార్ పాల్గొన్నారు. రాజేందర్ రెడ్డి గతంలో అమెరికాలో పర్యటించిన క్రమంలో అమెరికాలో స్థిరపడిన ఎన్నారైలను ప్రత్యేకంగా కలసి వరంగల్ వాసులుగా నగరానికి మీవంతు సహకారం అందించాలని కోరారు. ఈ మేరకు డాక్టర్ సుజీత్ కుమార్ నేతృత్వంలోని సుమారు 200 మంది ఎన్ఆర్ఐలు కలిసి కాకతీయ మెడికల్ కాలేజ్ (కేఎంసీ)లో మౌలిక సదుపాయాలకు రూ.10 కోట్ల విరాళం అందజేయనున్నట్లు వెల్లడించారు.

ఆధునిక వైద్య పరికరాలు, అదనపు వార్డులు, రోగుల కోసం అవసరమైన సౌకర్యాలు, విద్యార్థులకు శిక్షణ వనరులు వంటి అంశాలకు ఈ నిధులు వినియోగించనున్నట్లు తెలిపారు.



ఈ విరాళం ద్వారా అత్యాధునిక సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి పరికరాల ఏర్పాటు, అత్యవసర వైద్య విభాగాల బలోపేతం, శస్త్రచికిత్స సదుపాయాల విస్తరణకు దోహదం కానుందన్నారు. ఇటీవలి కాలంలో నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజ్, తాగునీటి సదుపాయాలు, విద్యాసంస్థల అభివృద్ధి వంటి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలోనూ అదే దిశగా పురోగతి సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, 'విదేశాల్లో స్థిరపడినా స్వగ్రామ అభివృద్ధి కోసం ఇంత పెద్ద మొత్తాన్ని ప్రకటించడం గర్వకారణం. ఇది కేవలం విరాళం కాదు, వరంగల్ పశ్చిమ ప్రజల ఆరోగ్య భద్రతకు పెట్టుబడి' అని అన్నారు. ఎన్ఆర్ఐల సేవాభావం ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. మన వరంగల్ నుంచి విద్యను అభ్యసించే విదేశాల్లో స్థిరపడిన అందరూ వీరిని ఆదర్శంగా తీసుకుని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# పర్వతగిరిలో ఆగని 'మట్టి' దందా..

- అధికారుల మౌనం వెనుక మతలబేంటి ?
- ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ రవాణా?
- జిల్లా కలెక్టర్‌కు యువత ఫిర్యాదు


**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా అక్రమ మట్టి రవాణా సాగిస్తున్నా.. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై స్థానికులు మండిపడుతున్నారు. వరుసగా పత్రికా కథనాలు వెలువడుతున్నా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

### రాత్రి వేళల్లో 'జేసీబీ'ల మోత..

మండల పరిధిలోని పలు గ్రామాల్లో అర్ధరాత్రి వేళల్లో ట్రాక్టర్లు, లారీల ద్వారా మట్టిని తరలిస్తున్న దృశ్యాలు నిత్యం కనిపిస్తున్నాయి. సహజ వనరులను కొల్లగొడుతూ అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారులను వివరణ కోరగా.. "అక్రమ రవాణా జరగడం లేదు, కేవలం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసమే మట్టిని తరలిస్తున్నాం" అని చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కలెక్టర్‌కు ఫిర్యాదు..

అధికారుల సమాధానాలు క్షేత్రస్థాయి పరిస్థితులకు భిన్నంగా ఉండటంతో, మండలంలోని పలువురు యువకులు నేరుగా జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. అక్రమ మట్టి రవాణాపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై, సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ప్రజా వనరులను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖపై ఉందని అధికారుల మరిచారన్నారు. రాజకీయ అండదండలతో సాగుతున్న ఈ దందాను అరికట్టకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పర్వతగిరిలో ఈ మట్టి దందాను అరికడతారో లేదో వేచి చూడాలి.



# 'నో హెల్మెట్ – నో ఫ్యూయల్'

## చిట్యాలలో పోలీసుల నయా నినాదం



**వరంగల్ వాయిస్, చిట్యాల :** రహదారి భద్రతపై వాహనదారుల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా నేడు చిట్యాల మండల కేంద్రంలో వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిట్యాల సీఐ మల్లేష్, ఎస్ఐ శ్రావణ్ కుమార్ సూచనల మేరకు మండలంలోని నాలుగు ప్రధాన పెట్రోల్ బంకులను పోలీసులు సందర్శించారు. ఈ సందర్భంగా పెట్రోల్ పంపుల వద్ద "నో హెల్మెట్ – నో ఫ్యూయల్" అనే నినాదంతో కూడిన స్టిక్కర్లను పోలీసులు అతికించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించేలా ప్రోత్సహించడం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్యను తగ్గించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. పెట్రోల్ బంకు యాజమాన్యాలు కూడా హెల్మెట్ లేని వారికి ఇంధనం పోయకుండా పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు అస్సాం, లాల్ సింగ్ లు పాల్గొని పెట్రోల్ పంపుల వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. రహదారి నిబంధనలు పాటించడం వల్ల ప్రాణాలకు భద్రత ఉంటుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా హెల్మెట్ ధరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# దౌలత్‌నగర్‌లో బతుకమ్మ విగ్రహం ధ్వంసం

## కఠిన చర్యలకు మహిళల డిమాండ్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండలంలోని దౌలత్ నగర్ గ్రామంలో చోటుచేసుకున్న విగ్రహా ధ్వంసం ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామ చెరువు కట్టపై భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన బతుకమ్మ తల్లి విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. బతుకమ్మ ఘాట్ వద్ద ఉన్న తల్లి–బిడ్డల విగ్రహం చేతులను విరగ్గొట్టి పరారైనట్లు గ్రామస్తులు గుర్తించారు. స్థానికులు, గ్రామ మహిళల కథనం ప్రకారం.. గత కొంతకాలంగా బతుకమ్మ వేడుకలు జరిగే ఈ పవిత్ర ప్రదేశం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రాత్రి సమయాల్లో కొందరు వ్యక్తులు ఇక్కడ మద్యం సేవిస్తూ అనుచితంగా ప్రవర్తిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో లేదా కావాలనే విగ్రహాన్ని ధ్వంసం చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విగ్రహం ధ్వంసం కావడంతో గ్రామ మహిళలు, యువత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తమ సెంటిమెంట్‌ను దెబ్బతీయడమేనని మండిపడ్డారు. "తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బతుకమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గం. వెంటనే దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలి." అని గ్రామ మహిళలు డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ధ్వంసమైన విగ్రహాన్ని వెంటనే పునర్నిర్మించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా బతుకమ్మ ఘాట్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

# 'నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం'

- 32 కెమెరాల విరాళం

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నగర భద్రతను పటిష్టం చేయడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఎంపవరింగ్ యువర్ ఎవరీడే సేఫ్టీ ', 'డొనేట్ ఏ కెమెరా' పథకాల్లో భాగంగా సైదాబాద్ పరిధిలోని కరణ్‌బాగ్ కాలనీ నివాసితులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 32 సీసీటీవీ కెమెరాలను విరాళంగా అందజేశారు. సోమవారం తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఈ కెమెరాలను సీపీకి అందించారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మాట్లాడుతూ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీసీ కెమెరాలు పోలీసు వ్యవస్థకు 'ఫోర్స్ మల్టిప్లైయర్స్'గా పనిచేస్తాయని, ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఆయన అభివర్ణించారు. నేరస్తులను త్వరగా పట్టుకోవడంలోనూ, పక్కా సాక్ష్యాధారాల సేకరణలోనూ ఈ నిఘా నేత్రాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. నగర ప్రజలు, కార్పొరేట్ సంస్థలు తమ సామాజిక



బాధ్యతలో భాగంగా మరిన్ని కెమెరాలను విరాళంగా ఇచ్చి నగర భద్రతలో భాగస్వాములు కావాలని కోరారు. కరణ్‌బాగ్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మైలాద్రి శ్రీనివాస్, కార్యదర్శి గడ్డం సుదర్శన్ ఆధ్వర్యంలో కాలనీ సభ్యులు జి.రవిచంద్ర యాదవ్, ఎన్.వేణుగోపాల్ రావు, ఎస్.తిరుమూర్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీస్ శాఖ తరపున చార్మినార్ జోన్ డీసీపీ ఖారే కిరణ్ ప్రభాకర్, ఎస్ఎంఐటీ డీసీపీ సీహెచ్ రూపేష్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సైదాబాద్ ఏసీపీ వెంకట్ రెడ్డి, ఎస్.హెచ్.ఓ చంద్రమోహన్ తదితరులు హాజరయ్యారు.

# కిక్ బాక్సింగ్‌లో వరంగల్ కేక

## రాష్ట్ర స్థాయిలో పతకాల పంట



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రస్థాయిలో జరిగిన సీఎం కప్ రెండో ఎడిషన్ కిక్ బాక్సింగ్ పోటీల్లో వరంగల్ జిల్లా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలతో మెరిశారు. ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఒక బంగారు, నాలుగు రజత, ఒక కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారని వరంగల్ జిల్లా కాకతీయ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు గడదాసు మణికంఠ తెలిపారు. 34 కేజీల సబ్ జూనియర్ బాలికల విభాగంలో వరంగల్‌కు చెందిన 'మణి మార్షల్ ఆర్ట్స్ మరియు ఫిట్నెస్ అకాడమీ' విద్యార్థిని పెరుక అక్షర అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. సబ్ జూనియర్ బాలుర విభాగంలో ఎల్పుల వికాస్ యాదవ్ (–42 కేజీలు), సళ్ల సాత్విక్ (–47 కేజీలు), ముత్తినేనీ నవనీత్ (–57 కేజీలు), సయ్యద్ కైఫ్ (–69 కేజీలు) రజత పతకాలతో సత్తా చాటారు. మొగిలి లసియా కాంస్య పతకాన్ని సాధించి జిల్లా కీర్తిని చాటింది. జిల్లాకు ఇన్ని పతకాలు రావడంపై తెలంగాణ రాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, జనరల్ సెక్రెటరీ మహిపాల్ హర్షం వ్యక్తం చేశారు. విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ కె.వెంకటేష్, ట్రెజరర్ వైష్ణవి, దేవదాస్, సతీష్, శ్రీ చరణ్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. జనరల్ సెక్రెటరీ మహిపాల్ ఇతర జిల్లాల అధ్యక్షులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# భాస్వర లోపంతో పంటలకు నష్టం?

## పీఎస్‌బీతో సులభ పరిష్కారం

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పంట భూముల్లో అధికంగా వాడిన భాస్వర ఎరువు పూర్తిగా కరగక మట్టిలో నిల్వ ఉండిపోవడంతో ఇతర పోషకాలు మొక్కలకు అందక నష్టాలు ఏర్పడుతున్నాయని వ్యవసాయ అధికారి ప్రశాంత్ కుమార్ తెలిపారు. దీనికి పరిష్కారంగా వ్యవసాయ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం కలిసి "ఫాస్ఫేట్ సాల్యూబిలైజింగ్ బ్యాక్టీరియా " అనే జీవ ఎరువును అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఈ జీవ ఎరువు మట్టిలో నిల్వ ఉన్న భాస్వరాన్ని కరిగించి మొక్కలకు అందుబాటులోకి తెస్తుందని తెలిపారు. ఎకరానికి 5 కిలోల చొప్పున పశువుల ఎరువు లేదా కంపోస్ట్‌తో కలిపి పొలంలో చల్లితే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. ఈ ఎరువు వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో లభిస్తుందని రైతులు వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

# విద్యార్థులకు బాసటగా నిలవాలి

## సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేపటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 38,600 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులు కనీసం అరగంట ముందుగానే అంటే 8:30 గంటల కల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించని నిబంధన ఉన్నందున, తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలను క్షేమంగా, నిర్ణీత సమయానికి కేంద్రాలకు చేర్చాలని కోరారు. పరీక్షల దృష్ట్యా ప్రజలకు ఆయన పలు సూచనలు చేశారు. విద్యార్థులను తీసుకెళ్లే వాహనదారులు ముందురోజే పెట్రోల్, టైర్ల పరిస్థితిని తనిఖీ చేసుకోవాలి. పెట్రోల్ బంకులు మరియు రహదారుల వద్ద పరీక్షలకు వెళ్లే విద్యార్థుల వాహనాలకు ప్రజలు ప్రాధాన్యత ఇవ్వాలి. దారిలో ఎవరైనా విద్యార్థులు వాహన సదుపాయం లేక లిఫ్ట్ కోరితే, మానవతా దృక్పథంతో సహాయం చేసి వారిని పరీక్షా కేంద్రాలకు చేర్చాలని కోరారు. ప్రస్తుతం ఎండలు ముదురుతున్నందున విద్యార్థులు తమ వెంట వాటర్ బాటిల్ తీసుకెళ్లాలని, ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా నిమ్మల శ్రీనివాస్ ఆకాంక్షించారు.

# శాస్త్రీయ దృక్పథంతోనే దేశ ప్రగతి

● ఇస్రో శాస్త్రవేత్త అనుమాండ్ల సుకృత



**వరంగల్ వాయిస్, నడికూడ :** విద్యార్థులలో చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని, వారి పరిశోధనలే భవిష్యత్తులో దేశ ప్రగతికి సోపానాలు అవుతాయని ఇస్రో శాస్త్రవేత్త అనుమాండ్ల సుకృత అన్నారు. నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ ఆహ్వానం మేరకు సోమవారం ఆమె పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన సుకృత, ఇస్రో ప్రాముఖ్యతను, రాకెట్లు మరియు శాటిలైట్ల పనితీరును వారికి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లలకు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, ప్రయోగాత్మక, పరిశీలనాత్మక విద్యను అందించాలని ఉపాధ్యాయులను కోరారు. తరగతి గదిలో విద్యార్థులు ఎప్పుడూ కొత్త ఆలోచనలతో ఉండాలని, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో చైతన్యం నింపేందుకు ఇలాంటి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్న ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, సిబ్బందిని ఆమె ప్రత్యేకంగా కొనియాడారు. విద్యార్థుల్లో ఖగోళ శాస్త్రం, సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు సుకృత తన వంతుగా పాఠశాలకు ఒక టెలిస్కోప్‌ను బహుమతిగా అందజేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఇస్రో శాస్త్రవేత్తను పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేందుకే శాస్త్రవేత్తలను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లకావత్ దేవా, కంచ రాజు కుమార్, పుల్లూరి రామకృష్ణ, పాఠశాల సిబ్బంది అరుణ, రమ, సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి




**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** గ్రామ పంచాయతీల్లో సర్పంచులు ఖర్చు చేసిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర సర్పంచుల ఫోరం ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్యని కలిసి మెమొరాండం సమర్పించారు. రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఈ భేటీ జరిగింది. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం సర్పంచులు అప్పులు చేసి మరి నిధులు ఖర్చు చేశారని, కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 15వ ఫైనాన్స్ నిధుల నుంచి ఈ పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. బిల్లులు రాక సర్పంచులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ఈ సందర్భంగా నేతలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచుల విన్నపంపై కమిషనర్ దివ్య సానుకూలంగా స్పందించారు. రికార్డుల ప్రకారం పరిశీలించి, అర్హమైన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నడికూడ మాజీ సర్పంచ్ కూర రవీందర్ రావు, ముస్త్యాలపల్లి సర్పంచ్ బొట్ల సంధ్య రవీందర్ తో పాటు వివిధ జిల్లాలకు చెందిన రాష్ట్ర సర్పంచుల ఫోరం ప్రతినిధులు పాల్గొన్నారు.

## జాతీయ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు రైనాకు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో అత్యంత ఘనంగా నిర్వహించిన 23వ జాతీయ సీనియర్ సిటిజన్స్ సమావేశం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు రైనాని వరంగల్ జిల్లా ప్రతినిధులు ప్రత్యేకంగా కలిసి గౌరవపూర్వకంగా సన్మానించారు. వరంగల్ సీనియర్ సిటిజన్స్ ఫోరం తరపున జాతీయ అధ్యక్షుడు రైనాకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. వరంగల్ జిల్లాలో సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. 23వ జాతీయ సమావేశాన్ని అత్యంత ప్రణాళికాబద్ధంగా నిర్వహించి, విజయవంతం చేసినందుకు వరంగల్ సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు సంయుక్తంగా జాతీయ కార్యవర్గానికి, ఇతర ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సీనియర్ సిటిజన్ల హక్కుల సాధనలో ఇలాంటి సమావేశాలు ఎంతో స్ఫూర్తినిస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ అధ్యక్షులు మల్లారెడ్డి, సహాయ కార్యదర్శి ఏ.రాజేంద్రప్రసాద్, జయేందర్ రెడ్డి, అశోక్, వీరస్వామి, శ్రీనివాస్, భారతి, విజయ కుమారి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని 12వ వార్డుకు చెందిన రాసమల్ల నరేష్ అనారోగ్యంతో అకాల మరణం చెందడం పట్ల బీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు గంట కళావతి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. నరేష్ మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే మంగళవారం ఆమె మృతుని నివాసానికి చేరుకున్నారు. నరేష్ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకసప్తప్త స్థితిలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనారోగ్యంతో చిన్న వయసులోనే నరేష్ మరణించడం ఆ కుటుంబానికి తీరని లోటని అన్నారు. బాధితులు అధైర్యపడొద్దని, ఈ కష్ట సమయంలో పార్టీ పరంగా కుటుంబానికి పూర్తి అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించాలి

డీఈవో గిరిరాజ్ గౌడ్



**వరంగల్ వాయిస్, దామెర :** పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్ సూచించారు. మంగళవారం దామెర మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో విద్యార్థులతో నేరుగా ముచ్చటించారు. ఇటీవలే ముగిసిన ప్రీ–ఫైనల్ పరీక్షల్లో వచ్చిన మార్కులపై విద్యార్థులను ఆరా తీశారు. తక్కువ మార్కులు వచ్చిన సబ్జెక్టుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పరీక్షల్లో సమాధానాలు రాసే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రత్యేక తరగతుల కోసం రూపొందించిన టైం టేబుల్‌ను పరిశీలించి, అది అమలు అవుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న స్నాక్స్ (అల్పాహారం) నాణ్యతను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించి, వారు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులను కోరారు. దామెర మండల విద్యాశాఖ అధికారి రాజేష్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు ఉమామహేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'కేయూ' విద్యార్థిని కృష్ణవేణికి స్వర్ణం

అభినందించిన వీసీ ప్రతాప్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయ కీర్తి ప్రతిష్టలు అంతర్జాతీయ స్థాయికి చేరాయి. ఇండోనేషియాలో జరిగిన అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీల్లో కేయూ పరిశోధక విద్యార్థిని కృష్ణవేణి మాచర్ల అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. విశ్వవిద్యాలయ డిఫరెంట్లీ ఎబుల్డ్ సెల్ సంచాలకులు డాక్టర్ ఎ.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 15న ఇండోనేషియాలోని సురకర్తా నగరంలో గల గోర్ ఎఫ్‌కోర్ యూనివర్సిటీలో 'ఇండోనేషియా ఇంటర్నేషనల్ పారా త్రోబాల్ మ్యాచ్ సిరీస్' నిర్వహించారు. ఈ పోటీల్లో భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధక విద్యార్థిని కృష్ణవేణి మాచర్ల తన అసాధారణ ప్రతిభతో స్వర్ణ పతకాన్ని ముద్దాడారు. అంతర్జాతీయ వేదికపై పతకం సాధించి విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా నిలిచిన కృష్ణవేణిని కేయూ ఉపకులపతి (వీసీ) ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ప్రత్యేకంగా అభినందించారు. శారీరక వైకల్యాన్ని అధిగమించి క్రీడల్లో రాణించడం అభినందనీయమని, భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ విజయం పట్ల విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజా పోరాటాలే కమ్యూనిస్టుల మార్గం

- ఎంసీపీఐ (యూ) జాతీయ కన్వెన్షన్
- పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా అశోక్ ఓంకార్




**వరంగల్ వాయిస్, జోధ్‌పూర్ (రాజస్థాన్):** దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత, రాజీలేని పోరాటాలే ఏకైక మార్గమని యంసీపీఐ (యూ) జాతీయ కన్వెన్షన్ ఉద్ఘాటించింది. రాజస్థాన్‌లోని షహీద్ భగత్ సింగ్ నగర్ (జోధ్‌పూర్) వేదికగా ఫిబ్రవరి 23, 24 తేదీలలో నిర్వహించిన పార్టీ ఐక్యత (యూనిటీ) జాతీయ కన్వెన్షన్ విజయవంతంగా ముగిసింది. 2018 నుంచి భిన్నాభిప్రాయాల కారణంగా రెండు వేర్వేరు కేంద్ర కమిటీలుగా పనిచేస్తున్న ఎంసీపీఐ (యు) వర్గాలు.. గత ఏడాది కాలంగా జరిపిన సుదీర్ఘ చర్చల ఫలితంగా ఈ కన్వెన్షన్ ద్వారా పునరేక్యం అయ్యాయి. కిరణ్ జిత్ సింగ్ షేఖాన్, మద్దిరెడ్డి వెంకటరెడ్డి, గాదగోని రవి, ప్రేమ్ సింగ్ భంగ్‌లతో కూడిన అధ్యక్ష వర్గం ఆధ్వర్యంలో ఈ ఐక్యతా ప్రక్రియ పూర్తయింది. ఈ కన్వెన్షన్ లో రెండు కేంద్ర కమిటీలను కలిపి ఒకే అత్యున్నత కేంద్ర కమిటీగా ఎన్నుకున్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ మద్దికాయల అశోక్ ఓంకార్‌ను ప్రతినిధులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, బీహార్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, చండీగఢ్ రాష్ట్రాల నుంచి సుమారు 220 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ ఫలితాలు ఆశించిన స్థాయిలో లేవని, పార్లమెంటరీ, ప్రజా క్షేత్రాల్లో కమ్యూనిస్టులు బలోపేతం కావాల్సిన అవసరం ఉందని నేతలు స్పష్టం చేశారు. ఈ ఐక్యత ద్వారా దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎంసీపీఐ (యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

5
WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, ఫిబ్రవరి 24, 2026

# రేపటి నుంచే ఇంటర్ పరీక్షలు

- జనగామ జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు
- 16 కేంద్రాలు.. 8,605 మంది విద్యార్థులు
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వెల్లడి



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లాలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీసీపీ రాజమహేంద్ర నాయక్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో గూగుల్ మీటింగ్ ద్వారా పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 16 వరకు ఉదయం 9:00 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో మొత్తం 8,605 మంది. (ప్రథమ సంవత్సరం: 4,211 మంది, ద్వితీయ సంవత్సరం: 4,394 మంది) హాజర కానున్నారు. జిల్లా వ్యాప్తంగా 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈసారి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హాల్ టిక్కెట్లపై క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసిందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఈ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా తమ పరీక్షా కేంద్రం ఖచ్చితమైన లోకేషన్‌ను సులభంగా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడికి గురైతే 'టెలీ మానస్' నంబర్ 14416 కు ఫోన్ చేసి నిపుణుల సలహాలు పొందవచ్చు. జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ నంబర్ 9550371371 కు సంప్రదించవచ్చు. కేంద్రాల్లో క్లాక్ రూమ్ సౌకర్యం ఉండాలని, మొబైల్ ఫోన్లను లోపలికి అనుమతించకూడదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా, నాణ్యమైన త్రాగునీరు, పారిశుద్ధ్యం మరియు ఉచిత వైద్య శిబిరాలను అందుబాటులో ఉంచాలి. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా సమయాలకు అనుగుణంగా ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడపాలని సూచించారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల తరలింపు సమయంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జితేందర్ రెడ్డి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులకు ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వరంగల్ ఉమ్మడి జిల్లాల ఉద్యమకారుల సంఘం కన్వీనర్, 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి డిమాండ్ చేశారు. మంగళవారం ఉర్సు ప్రతాప్ నగర్‌లో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మరుపల్ల రవి మాట్లాడుతూ.. స్వరాష్ట్రం కోసం తమ కుటుంబాలను, ఆర్థిక స్థితిగతులను పణంగా పెట్టిన ఎందరో ఉద్యమకారులు నేడు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా.. జైలు జీవితం గడిపిన, కేసులు ఎదుర్కొన్న ఉద్యమకారులకు నెలకు రూ.25 వేల పింఛన్, 250 గజాల నివాస స్థలాన్ని తక్షణమే కేటాయించాలని కోరారు.కేసులు లేకపోయినా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న వారిని పోలీస్ శాఖ ద్వారా గుర్తించి, వారిని కూడా ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం ఏర్పడి రెండు ఏళ్లు గడుస్తున్నా ఉద్యమకారుల సంక్షేమాన్ని విస్మరించడం సరికాదని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులంతా ఏకమై మరో పోరాటానికి సిద్ధమవుతామని, అందుకు నేటి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ తాళ్ల ఉమాదేవి, శంకేసి లింగమూర్తి, కేతిరి రాజశేఖర్, కోడూరు నరేష్, మోక్ష అంకం దేవానంద్, బొద్దుల కుమార్ స్వామి, కించ ఆనంద్, సోమ మధుకర్, టి.కనకరాజు, ఎం.రాజ్ కుమార్, ఆవునూరి లక్ష్మి, కొడిపాక రమాదేవి, ముసినిపల్లి జమున, చిదురాల సుజాత, సోమ ఉపేంద్ర, కొండపాక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ నిందితుడి అరెస్ట్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ఒంటరిగా వెళ్తున్న మహిళకు లిఫ్ట్ ఇచ్చి, ఆపై ఆమె మెడలోని పుస్తెల త్రాడును దొంగిలించిన నిందితుడిని చెన్నారావుపేట పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. మంగళవారం నిందితుడిని పట్టుకుని అతని వద్ద నుంచి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జి.రాజేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం తిమ్మరానిపహాడ్ క్రాస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, నమ్మదగిన సమాచారంతో నిందితుడు బానోతు ఈరును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 4 తులాల బంగారు పుస్తెల త్రాడు, ఒక సెల్ ఫోన్, నేరానికి ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# పసిపాప ప్రాణం తీసిన కుల అహంకారం

- నిందితులను ఉరితీయాలి
- పీడీఎస్ యూ భారీ నిరసన




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో దళిత కుటుంబంపై జరిగిన కుల అహంకార దాడిలో రెండు నెలల పసిపాప ప్రాణాలు కోల్పోవడంపై విద్యార్థి లోకం భగ్గుమంది. నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్ యూ వరంగల్-హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లేకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి అజయ్ మాట్లాడుతూ సమాజం తలదించుకునే ఘటనను వివరించారు. కేవలం టికెట్ లేకుండా గుడిలోకి ప్రవేశించారనే నెపంతో అదే గ్రామానికి చెందిన సర్పంచ్ తుకారాం రెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మధు రెడ్డి తదితరులు చాకలి కులస్తులైన గణేష్, చంద్రకళ, మౌనికలపై భౌతిక దాడికి దిగారు. దురహంకారంతో ఊగిపోయిన నిందితులు, కేవలం రెండు నెలల వయసున్న పసిబిడ్డను కాలుతో తన్ని కిరాతకంగా చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అగ్రవర్ణ దురహంకార చర్యను సంఘం తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ఇంతటి దారుణం జరిగి వారం రోజులు గడుస్తున్నా, నిందితులపై చర్యలు తీసుకోకుండా బాధిత కుటుంబంపైనే అక్రమ కేసులు పెట్టడం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. అగ్రవర్ణాలకు కొమ్ముకాస్తున్న స్థానిక పోలీసు అధికారులను తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నిందితులందరిని తక్షణమే అరెస్ట్ చేసి ఉరిశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన రక్షణ కల్పించి, భారీ నష్టపరిహారం చెల్లించాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలి. పీడీఎస్ యూ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ, నాయకులు చరణ్, వివేక్, శివ, ధనూష్, అరవింద్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణ రక్షణకు హెల్మెట్ కవచం

**దామెర ఎస్సై కొంక అశోక్**



**వరంగల్ వాయిస్, దామెర :** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్ -2026' కార్యక్రమంలో భాగంగా దామెర మండల కేంద్రంలో రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర డీజీపీ శ్రీ శివధర్ రెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు సాగే ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మంగళవారం హెల్మెట్ ప్రాముఖ్యతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దామెర ఎస్సై కొంక అశోక్ మాట్లాడుతూ పలు కీలక సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయాల్లో తలకి గాయాలు కాకుండా ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించని పక్షంలో మోటార్ వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని, సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. వాహనదారులలో మార్పు తీసుకువచ్చేలా పోలీసులు మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల గుండా హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రమేష్, కానిస్టేబుల్ శ్రీనివాస్, స్థానిక వాహనదారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** సాధారణంగా పుట్టినరోజు వేడుకలంటే విందు వినోదాలతో జరుపుకుంటారు. కానీ, ఆ దంపతులు మాత్రం తమ పుట్టినరోజును పేద విద్యార్థులకు బాసటగా నిలిచి జరుపుకొని తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు. హైదరాబాద్ శేర్లింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని కొండాపూర్ 'అవినా హోమ్స్' నివాసితులైన ఠాకూర్ అనిత - శివారెడ్డి దంపతులు ఈ అభినందనీయమైన కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం అనిత శివారెడ్డి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని.. డోర్నకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 21 మంది విద్యార్థులకు ఆటల పోటీలకు అవసరమయ్యే లోయర్లు, టీషర్టులను అందజేశారు. పాఠశాలలో హిందీ బోధిస్తున్న ఉపాధ్యాయురాలు కలపాల అనిత అభ్యర్థన మేరకు, తమ బంధువులైన అనిత శివారెడ్డి దంపతులు ఈ సామాజిక బాధ్యతను స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి నరసింహారావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను గుర్తించి, వారికి అవసరమైన క్రీడా దుస్తులను బహుకరించడం హర్షణీయమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించిన అనిత శివారెడ్డి దంపతులకు పాఠశాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమనబోయిన శ్రీనివాస్, శంకర్, రవికుమార్, విద్యాసాగర్, అప్పిరెడ్డి, సాహెబ్ అలీ, శంకరయ్య, రాం నాయక్, రమేష్, బిచ్చా, వెంకటేశ్వర్లు, సమిత, శేషు కుమారి, వసంతరాణి, మంజులతా పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్లకు ఆర్థిక చేయూత

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లాలోని ట్రాన్స్‌జెండర్ల (లింగమార్పిడి వ్యక్తులు) సామాజిక, ఆర్థిక వికాసం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పునరావాస పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.సభిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు మొత్తం 3 యూనిట్లను కేటాయించారు. ఒక్కో యూనిట్‌కు రూ. 75,000/- చొప్పున మొత్తం రూ. 2,25,000/- నిధులు మంజూరయ్యాయి.ఈ పథకం కింద అందించే ఆర్థిక సాయం 100 శాతం సబ్సిడీతో కూడుకున్నది. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు ఫారమ్‌ను www.wdsc.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను అవసరమైన ధ్రువపత్రాలతో కలిపి ఈ నెల 27-02-2026 లోపు సమర్పించాలి. జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, కలెక్టరేట్ కాంప్లెక్స్ – మహబూబాబాద్, రూమ్ నెంబర్ 2 నందు సంప్రదించి దరఖాస్తు అందజేయాలన్నారు.

# సిద్ధాపురంలో దారుణం

## వృద్ధుడి దారుణ హత్య



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** మండలంలోని సిద్ధాపురం గ్రామంలో ఘోరం జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో బాల్నే మొగిలి అనే వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతుడి కుమారుడు బాల్నే రాజకుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు బాల్నే మొగిలి, అతని భార్య సరోజన గత 20 ఏళ్లుగా హనుమకొండలోని అమృత హాస్పిటల్‌లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తూ అక్కడే నివసించేవారు. సిద్ధాపురంలో ఉన్న వారి సొంత ఇంట్లో సరోజన చెల్లెలు (మొగిలికి చిన్నమ్మ వరుస) వంగ ఇందిర నివసిస్తూ వస్తోంది. మూడు నెలల క్రితం మొగిలి భార్య సరోజన మరణించడంతో, అతను తిరిగి తన సొంత గ్రామైన సిద్ధాపురానికి వచ్చి అదే ఇంట్లో ఉండడం ప్రారంభించాడు. ఒకే ఇంట్లో ఉంటున్న మొగిలికి, ఇందిరకు మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని మొగిలి తన కుమారుడు రాజకుమార్‌కు కూడా పలుమార్లు చెప్పి బాధపడ్డాడు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం మొగిలి తన ఇంటి వెనుక శవమై కనిపించాడు. రాజకుమార్ అక్కడికి చేరుకుని చూడగా.. తండ్రి ముఖం, నుదురుపై పదునైన ఆయుధంతో దాడి చేసిన గుర్తులు, మెడ, ఛాతిపై కమిన గాయాలు ఉన్నాయి. హత్య సమాచారం అందుకున్న వెంటనే డీసీపీ కవిత, హసన్ పర్తి సీఐ వట్టే చేరాలు, ఎస్సైలు దేవేందర్, రవి, గోవర్ధన్,సుజిత్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించారు. ఆస్తి గొడవలు లేదా వ్యక్తిగత కక్షల కారణంగానే ఈ హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు వంగ ఇందిరపై మర్డర్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితురాలిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నామని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

# ప్రింటింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు

- అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు
- ఘనంగా ప్రింటర్స్ డే వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రింటింగ్ రంగ పితామహుడు సర్ జాన్ గుటెన్ బర్గ్ జన్మదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ చౌరస్తాలోని ప్రింటర్స్ స్ట్రీట్‌లో 'ప్రింటర్స్ డే' ఉత్సవాలను మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వరంగల్ అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరై, గుటెన్ బర్గ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాయల ప్రభాకర్ రావు మాట్లాడుతూ ప్రింటింగ్ రంగంలో వస్తున్న మార్పులను కొనియాడారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అధునాతన సాంకేతికతతో డిజైనింగ్ ప్రక్రియ ఎంతో సులభతరమైందని తెలిపారు. సాంకేతికత ఎన్ని మార్పులు తెచ్చినా, ఒక ప్రింటర్ తన సృజనాత్మకతతో చేసే డిజైన్ ఇచ్చే సంతృప్తి సాటిలేనిదని అన్నారు. సమాజంలో ప్రింటింగ్ రంగం యొక్క ఆవశ్యకత ఎప్పటికీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రింటర్స్ డే సందర్భంగా స్థానిక ప్రింటర్లు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రింటర్స్ బాధ్యులు మాటేటి సంతోష్ కుమార్, తెలుకల రాజేందర్ రెడ్డి, కుసుమ రాజేందర్, పాతకోటి శ్రీనివాస్, బాలరాజు, ఓరుగంటి రవి కుమార్, నాగరాజు, వేణు, అశోక్, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షల నిర్వహణలో ఏమరపాటు వద్దు

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- పరీక్షల సన్నద్ధతపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్
- పాల్గొన్న కలెక్టర్ స్నేహా శబరీష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచి పరీక్షల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి డా.యోగితా రాణా, కృష్ణ ఆదిత్య, నికోలస్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహా శబరిష్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని జిల్లాలో చేసిన ఏర్పాట్లను వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర నిఘా ఉంచాలని, మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా త్రాగునీరు, విద్యుత్, ఫర్నీచర్,తగినంత వెలుతురు ఉండేలా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, విద్యార్థులు సమయానికి చేరుకోవడానికి వీలుగా ఆర్టీసీ బస్సులను నడపాలని సూచించారు. నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున, విద్యార్థులు ఆందోళన చెందకుండా ముందే కేంద్రాలకు చేరుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహా శబరిష్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇంటర్, పదో తరగతి పరీక్షల కోసం ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించామని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు.

# మహిళలను లక్షాధికారులు చేయడమే లక్ష్యం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారిని లక్షాధికారులుగా మార్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'లఖ్‌పతి దీదీ' పథకాన్ని ప్రవేశపెట్టిందని డీపీఎం సరిత తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ సమాఖ్య భవనంలో జరిగిన మహిళా సంఘాల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డీపీఎం సరిత మాట్లాడుతూ పలు కీలక అంశాలను వెల్లడించారు. దేశవ్యాప్తంగా కోటి మంది మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దేందుకు ఈ పథకం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే అనేకమంది మహిళలు ఈ పథకం ద్వారా లబ్ధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకున్నారని తెలిపారు. మహిళా సంఘాల్లోని సభ్యులకు స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణ మరియు తగిన ఆర్థిక వనరులు కల్పించడం ద్వారా వారి వార్షిక ఆదాయాన్ని లక్ష రూపాయలకు పైగా పెంచడమే ఈ స్కీమ్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. ప్రస్తుతం ఈ పథకంపై గ్రామీణ మహిళల్లో విశేష ఆసక్తి నెలకొందని ఆమె అన్నారు. మహిళలు కేవలం పొదుపుకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, మండల సమాఖ్య ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# సురక్షిత ప్రయాణమే లక్ష్యం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించే లక్ష్యంతో ఆత్మకూరు మండల కేంద్రంలో "అరైవ్ అండ్ అలైవ్" కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, పరకాల ఏసీపీ సతీష్ బాబు, మణీషా నెహ్రా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభను ఉద్దేశించి అధికారులు మాట్లాడుతూ పలు కీలక సూచనలు చేశారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, అది కేవలం జరిమానాల కోసం కాదని, ప్రాణ రక్షణ కోసమని గుర్తు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తద్వారా ప్రమాద సమయాల్లో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని వివరించారు. రహదారి భద్రతపై చైతన్యం కల్పించేందుకు గుర్తుగా ఐదుగురు వాహనదారులకు అధికారుల చేతుల మీదుగా హెల్మెట్లను పంపిణీ చేశారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు పోలీసులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆత్మకూరు పోచమ్మ ఆలయం నుంచి గూడెప్పాడ్ సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీలో పోలీసులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. "నిబంధనలు పాటిద్దాం-సురక్షితంగా చేరుకుందాం" అనే నినాదాలతో రహదారి భద్రత ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్ సంతోష్, ఎస్సైలు తిరుపతి, సతీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

- అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు
- హెల్మెట్లను పంపిణీ చేసిన ట్రాఫిక్ పోలీసులు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని వరంగల్ అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, 'అరైవ్ అండ్ అలైవ్' రెండో విడత కార్యక్రమంలో భాగంగా మంగళవారం హంటర్ రోడ్‌లోని న్యూ సైన్స్ డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. కాజీపేట ట్రాఫిక్ సీఐ పిట్టల వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు 'డిఫెన్సివ్ డ్రైవింగ్' (రక్షణాత్మక డ్రైవింగ్) పై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించడం ప్రాణరక్షణకు అత్యంత ఆవశ్యకమని డీసీపీ వివరించారు. ఎదుటివారు తప్పు చేసినా మనం అప్రమత్తంగా ఉండి ప్రమాదాల నుండి ఎలా బయటపడాలి అనే అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. అనంతరం శాయంపేట ట్రాఫిక్ జంక్షన్ వద్ద పోలీసులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను ఆపి, వారికి హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ, సీఐ వెంకన్నలు వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ, కార్పొరేటర్ మామిండ్ల రాజు, కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ట్రాఫిక్ ఎస్సైలు శ్రావణ్ కుమార్, సంపత్,సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# శర్వాతో రుక్మిణీ వసంత్ జోడీ ?



టాలీవుడ్‌లో రుక్మిణి వసంత్ పేరు మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌తో వినిపిస్తోంది. శర్వానంద్–శ్రీను వైట్ల కాంబినేషన్‌లో తెరకెక్కనున్న తాజా చిత్రంలో హీరోయిన్‌గా ఆమెను పరిశీలిస్తున్నట్లు సమాచారం. 'కాంతారా'తో పాన్ ఇండియా గుర్తింపు పొందిన రుక్మిణి ప్రస్తుతం ఎన్టీఆర్ 'డ్రాగన్' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఇప్పుడు శర్వాతో జోడీ కడితే ఆమె క్రేజ్ మరింత పెరగనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే అదే చిత్రానికి ఆషికా రంగనాథ్ పేరు కూడా గట్టిగా వినిపిస్తోంది . టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్‌కు తాజా సంక్రాంతి హిట్‌తో మళ్లీ ఫుల్ స్వింగ్‌లోకి వచ్చేశాడు. ఈ సంక్రాంతికి అందరికంటే ఆలస్యంగా థియేటర్లలోకి వచ్చిన 'నారీ నారీ నడుమ మురారి' చిత్రం బలమైన మౌత్ టాక్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. కొంతకాలంగా వరుస ఫ్లాప్‌ల్లో ఉన్న శర్వానంద్‌కి ఈ మూవీ పెద్ద రిలీఫ్ ఇచ్చిందనే చెప్పాలి. దీంతో ఆయన నెక్ట్స్ సినిమాలపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే శర్వా నటించిన 'బైకర్' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ఏప్రిల్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. త్వరలోనే ప్రమోషన్లు కూడా ప్రారంభం కానున్నాయి. ఇక నెక్ట్స్ ప్రాజెక్ట్‌గా శర్వానంద్ దర్శకుడు శ్రీను వైట్లతో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. 'నారీ నారీ నడుమ మురారి' సక్సెస్ మీట్‌లో శర్వానంద్ మాట్లాడుతూ, 'సంక్రాంతి నాకు సెంటిమెంట్. శ్రీను వైట్లతో చేసే సినిమాతో వచ్చే సంక్రాంతికీ తప్పకుండా వస్తా' అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో తెరకెక్కనున్న ఈ చిత్రం కూడా ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కనుందని టాక్. ఒకప్పుడు వరుస హిట్లు అందుకుని స్టార్ డైరెక్టర్‌గా కొనసాగిన శ్రీను వైట్లకు ఇటీవలి కాలంలో పెద్ద సక్సెస్ లేకపోయినా, శర్వానంద్ హిట్ ఫామ్‌లో ఉండటంతో ఈ కాంబోపై అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాలో హీరోయిన్ ఎంపికపై ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చ సాగుతోంది. శర్వానంద్ జోడిగా రుక్మిణి వసంత్ నటించనున్నారనే వార్తలు వైరల్ అవుతున్నాయి. 'కాంతారా'తో పాన్ ఇండియా గుర్తింపు పొందిన రుక్మిణి, ప్రస్తుతం పలు పెద్ద ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ నటిస్తున్న 'డ్రాగన్' చిత్రంలో ఆమె హీరోయిన్‌గా నటిస్తోంది. దీంతో శర్వా–రుక్మిణి జంటపై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.




# లెస్బియన్స్ కథతో.. రష్మిక, కృతి


నేషనల్ క్రష్‌గా గుర్తింపు పొందిన రష్మిక మందానా ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకుపోతోంది. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకూ తనదైన గుర్తింపు సంపాదించుకున్న ఈ బ్యూటీ గ్లామర్‌తో పాటు నటనలోనూ మెరిట్ చూపిస్తూ స్టార్ హీరోయిన్ స్టేటస్ అనుభవిస్తోంది. ఇటీవలి కాలంలో కమర్షియల్ రోల్స్‌తో పాటు ప్రయోగాత్మక పాత్రల వైపు కూడా అడుగులు వేస్తూ కెరీర్‌ను విభిన్నంగా మలుచుకుంటోంది. ఇలాంటి సమయంలో ఆమె ప్రస్తుతం నటిస్తోన్న బాలీవుడ్ ప్రాజెక్ట్‌పై ఆసక్తికరమైన వార్త బయటికొచ్చింది. బాలీవుడ్ వర్గాల ప్రకారం 'కాక్‌టెయిల్' చిత్రంలో కృతి సనన్, రష్మిక స్వలింగ ప్రేమికులు (లెస్బియన్స్)గా కనిపించనున్నారనే వార్తలు వైరల్ అవుతున్నాయి. ట్రయాంగిల్ లవ్ స్టోరీ బ్యాక్‌డ్రాప్‌లో కథ నడుస్తుందని, ఈ ఇద్దరి పాత్రలు కథకు కీలకంగా ఉంటాయని ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు రష్మిక ఇలాంటి బోల్డ్ కోణంలో కనిపించలేదు కాబట్టి తాజా టాక్‌పై ఇండస్ట్రీ వర్గాల్లో భారీగా చర్చ నడుస్తోంది. అయితే ఈ అంశంపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. దీంతో ఇది కేవలం ఇండస్ట్రీ గాసిప్ మాత్రమేనా? లేక నిజంగానే రష్మిక లెస్బియన్‌గా నటించిందా అన్న చర్చ కొనసాగుతోంది. భిన్నమైన పాత్రలను స్వీకరించడానికి తానెప్పుడు సిద్ధంగా ఉంటానని రష్మిక చాలాసార్లు చెప్పిన నేపథ్యంలో ఈ ప్రచారం నిజమైతే ఆమె కెరీర్‌లో ఇది మరో సాహసోపేతమైన పాత్ర అవుతుందని భావిస్తున్నారు.



# సుజీత్, నానీ కాంబో 'బ్లడీ రోమియో'

కంటెంట్ సెలక్షన్‌లో వైవిధ్యం, నటనలో సహజత్వంతో నేచురల్ స్టార్ నాని టాలీవుడ్‌లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రయాణం మొదలుపెట్టి 'అష్టాచెమ్మా'తో హీరోగా మారిన ఆయన వరుస విజయాలు అందుకుంటూ స్టార్ హీరోగా మారారు. మరోవైపు నిర్మాతగా కొత్త టాలెంట్‌కి అవకాశాలు కల్పిస్తూ ప్రసంశలు అందుకుంటున్నారు. మరోవైపు దర్శకుడు సుజీత్ .. స్టైలిష్ మేకింగ్‌తో తనదైన మార్క్ చూపిస్తూ ఇటీవలే 'ఓజీ'తో బ్లాక్‌బస్టర్ అందుకున్నాడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తోందన్న వార్త బయటకు వచ్చినప్పటి నుంచే సినీ వర్గాల్లో మంచి హైప్ ఏర్పడింది. ముఖ్యంగా 'ఓజీ' తర్వాత సుజీత్ తీస్తున్న ప్రాజెక్ట్ కావడంతో అంచనాలు మరింత పెరిగాయి. నాని పుట్టినరోజు సందర్భంగా మంగళవారం వరుస ట్రీట్స్ అందుతున్నాయి. ఇప్పటికే 'ది ప్యారడైజ్' అప్‌డేట్‌తో జోష్‌లో ఉన్న ఫ్యాన్స్‌కు, ఇప్పుడు నాని–సుజీత్ కాంబో మూవీ టైటిల్ అనౌన్స్‌మెంట్ మరింత కిక్ ఇచ్చింది. మేకర్స్ ఈ చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ కాన్సెప్ట్ గ్లింప్స్ విడుదల చేశారు. విడుదలైన వీడియోలో సుజీత్ స్టైల్ స్పష్టంగా కనిపిస్తుండగా, నాని పాత్రపై ఆసక్తి పెరిగింది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే ఇది డార్క్ క్రైమ్ కామెడీ టచ్‌తో కూడిన స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్నట్లు తెలుస్తోంది. 'చిటికెడు కరుణ, పిడికెడు కోపం, బారెడు బీభత్సం.. మతిపోయేంత ప్రేమ' అనే ట్యాగ్‌లైన్‌తో హీరో క్యారెక్టర్‌ను ఆసక్తికరంగా పరిచయం చేశారు. ఈ చిత్రంలో నాని ఒక చెఫ్‌గా కనిపించడమే కాకుండా గ్యాంగ్‌స్టర్ షేడ్స్ ఉన్న పాత్రలో కూడా మెప్పించనున్నట్లు సమాచారం.





# పూరీతో బాలయ్య.. మళ్లీ రిపీట్?

నందమూరి బాలకృష్ణ, పూరీ జగన్నాథ్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అయ్యే అవకాశముందని టాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. గతంలో వీరిద్దరూ కలిసి చేసిన 'పైసా వసూల్' మిక్స్‌డ్ ఫలితం ఇచ్చినా, బాలయ్య స్టైలిష్ అవతార్ అభిమానులను ఆకట్టుకుంది. ప్రస్తుతం వరుస విజయాలతో జోరులో ఉన్న బాలయ్య, సరైన కథ వస్తే పూరీతో మళ్లీ పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నారని ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం పూరీ జగన్నాథ్ విజయ్ సేతుపతితో ఓ సినిమా రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పూరీ జగన్నాథ్‌తో బాలయ్య మరోసారి చేతులు కలపబోతున్నారనే వార్త టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. పూరీ మార్క్ డైలాగ్ డెలివరీ, ఆటిట్యూడ్‌కు బాలయ్య ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్ ప్రత్యేకంగా నిలిచింది. ఆ సినిమాతో ఈ ఇద్దరి మధ్య మంచి అండర్‌స్టాండింగ్ ఏర్పడిందని అప్పట్లోనే ఇండస్ట్రీలో చర్చ జరిగింది. కమర్షియల్‌గా భారీ హిట్ కాకపోయినా, బాలయ్యను కొత్త కోణంలో చూపించిన సినిమాగా 'పైసా వసూల్' గుర్తింపు పొందింది. ఇప్పుడీ కాంబో మళ్లీ రిపీట్ కావచ్చన్న వార్తలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ప్రస్తుతం పూరీ జగన్నాథ్ ఫామ్‌లో లేకపోయినా, ఆయన స్టైలిష్ మేకింగ్, పవర్‌ఫుల్ క్యారెక్టరైజేషన్‌పై బాలయ్య నమ్మకం ఉంచినట్లు టాక్ వినిపిస్తోంది. సరైన కథతో వస్తే పూరీతో మరోసారి పని చేయడానికి ఆయన సిద్ధంగా ఉన్నారనే ప్రచారం కొనసాగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడలేదు. చాలాకాలంగా సరైన్ హిట్ లేక సతమతమవుతోన్న ఆయన ఆ చిత్రం ద్వారా టాలీవుడ్‌కి తన సత్తా ఏమిటో చూపించాలని పట్టుదలగా ఉన్నారు. ఈ సెన్సేషనల్ కాంబినేషన్ మళ్లీ పట్టాలెక్కుతుందా లేదా అన్నదానిపై క్లారిటీ రావాల్సి ఉంది.

# ఫ్యూచర్ సిటీపై ఉన్న ధ్యాస..
# పేదలకు ప్రాణంపోసే హెల్త్ సిటీపై లేదు

- మాజీ మంత్రి హరీష్ రావు
- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సందర్శన
- పనులు నత్తనడకన సాగడంపై సీరియస్



(మొదటి పేజీ తరువాయి..) వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను మంగళవారం ఇతర బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఆసుపత్రి పనుల పురోగతిని పరిశీలించిన అనంతరం హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మా దెబ్బకే సీఎంకు సోయి వచ్చిందన్నారు. మొన్న మేము దేవాదుల ప్రాజెక్టును సందర్శించినప్పుడు, సమ్మక్క బ్యారేజీలోని 10 మోటార్లలో కేవలం ఆరు మాత్రమే నడుస్తున్నాయని, రోజుకు 2,700 క్యూసెక్కులు ఎత్తాల్సిన చోట 1,700 క్యూసెక్కులు కూడా ఎత్తడం లేదన్న విషయాన్ని ఎత్తిచూపామన్నారు. కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రాజెక్టు ఏ విధంగా దెబ్బతింటుందో ప్రజల ముందు ఉంచామన్నారు. ఆ దెబ్బకు తెల్లారి ముఖ్యమంత్రి హడావిడిగా రివ్యూ చేసి అన్ని మోటార్లు నడపాలని ఆదేశించారన్నారు. ఇది బీఆర్ఎస్ విజయమే కాదు, రైతుల విజయం అన్నారు. దేవాదుల ప్రాజెక్టు పనుల విషయంలో డెడ్ లైన్లు మారుతున్నాయి తప్ప.. పనులు ముందుకు సాగడం లేదని హరీష్ రావు ఆరోపించారు. మంత్రులు దేవాదుల ప్రాజెక్టు తమ ప్రాధాన్యం అని పదేపదే చెప్తున్నారు, కానీ చేతల్లో మాత్రం అది వారికి చివరి ప్రాధాన్యంగా మారిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రూ.7,300 కోట్లు ఖర్చు పెట్టి 3.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ మంత్రులు డెడ్ లైన్లు మార్చుకుంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మార్చి 2026 నాటికి పూర్తి చేస్తామంటే, ఉత్తమ్ కుమార్ రెడ్డి 2027 మార్చి డెడ్ లైన్ పెట్టారు. భూసేకరణకు నిధులు విడుదల చేయడం చేతకాని రేవంత్ రెడ్డి, ఉన్న మోటార్లను నడపలేక రైతుల పంటలు ఎండిపోయేలా చేస్తున్నాడన్నారు. రెండున్నరేళ్లలో ముఖ్యమంత్రి గోదావరి మీద ఒక్క ప్రాజెక్టు అయినా కట్టారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరిపై అనేక బ్యారేజీలు నిర్మించి, 312 కిలోమీటర్ల మేర గోదావరిని నిండుకుండలా సజీవంగా ఉంచిందని గుర్తు చేశారు. తొమ్మిది ఏళ్లలో మేం 48 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తే, మీ రెండున్నరేళ్లలో కనీసం లక్ష ఎకరాలకైనా నీళ్లిచ్చారా అని నిలదీశారు.

## సవాల్ కు రెడీ..

ఇరిగేషన్ మీద అసెంబ్లీలో మాట్లాడతామని ముఖ్యమంత్రి అంటున్నారు.. మేము మీ సవాల్‌ను స్వీకరిస్తున్నామని హరీష్ రావు ప్రకటించారు. అయితే మైక్ కట్ చేయకుండా, కెమెరా తిప్పకుండా చర్చ పెట్టాలన్నారు. ఎన్ని రోజులైనా, ఏ ప్రాజెక్టు మీదైనా చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజలే న్యాయ నిర్ణేతలు.. ఎవరు ఏం చేశారో అసెంబ్లీ వేదికగా తేల్చుకుందామంటూ ప్రతి సవాల్ విశిరారు. మొన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి రివ్యూలో మాట్లాడుతుంటే, ఆయనను ఆపి కడియం శ్రీహరికి దేవాదులపై మంచి నాలెడ్జ్ ఉంది, నెక్స్ట్ రివ్యూలో ఆయన్ను పిలవండి అని సీఎం అనడం ఇరిగేషన్ మంత్రిని అవమానించడమే అన్నారు. నీ సొంత క్యాబినెట్ మంత్రికే ఏమీ తెలియదని నువ్వే చెప్తుంటే, ఇక నువ్వు వేరే వాళ్లతో ఎలా పనులు చేయిస్తావు రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలోనే 24 అంతస్తుల స్లాబులు పూర్తయిన ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని చూస్తుంటే బాధేస్తోందన్నారు. 2024 దసరాకే ఇది ప్రారంభం కావాల్సింది అన్నారు. కేసీఆర్ ఉండి ఉంటే ఈపాటికి ప్రజలకు అందుబాటులోకి వచ్చేదన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చాక పనులు అటకెక్కి, రెండు దసరాలు పోయి మూడో దసరా వస్తున్నా పనులు కదలడం లేదన్నారు. రేవంత్ రెడ్డికి ఫ్యూచర్ సిటీ, రియల్ ఎస్టేట్ వ్యాపారం, కాంట్రాక్టర్ల మీద ఉన్న శ్రద్ధ.. కేసీఆర్ కట్టిన ఈ హెల్త్ సిటీ మీద లేదన్నారు. ఫ్యూచర్ సిటీకి పెట్టిన శ్రద్ధలో 10 శాతం పెట్టినా ఈ పనులు ఎప్పుడో పూర్తయ్యేవన్నారు. ఆసుపత్రి పూర్తయితే కొన్ని వేల మంది పేదలకు వైద్యం దొరుకుతుంది. కేసీఆర్ గారి మీద పడి ఏడ్వడం మానేసి, 20 లక్షల స్క్వేర్ ఫీట్స్ తో కడుతున్న ఈ ఆసుపత్రిని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ పర్యటనలో హరీష్ రావు వెంట మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, రవీందర్ రావు, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, అరూరి రమేష్, నన్నపునేని నరేందర్, శంకర్ నాయక్, సీనియర్ నాయకులు నాగుర్ల వెంకన్న, మర్రి యాదవ రెడ్డి, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ సహా పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష నేతలను జైల్లో పెడుతున్నారు..

బాల్క సుమన్, గ్రేటర్ వరంగల్ బీఆర్ఎస్ పార్టీ 4వ డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్ ను కుట్రతోనే అరెస్ట్ చేసి జైళ్ళలో బంధించారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. పోలీసులు అధికార పక్షం మాట విని బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. బొంగు అశోక్ యాదవ్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్ ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్ భార్య అనిత, కుమారుడు అఖిల్ హరీష్ రావుతో తమ గోడు వెలిబుచ్చారు. రఘు, లక్ష్మణ్ ప్రభుత్వ స్థలం కబ్జా చేస్తే ప్రశ్నించారని కక్ష పెట్టుకొని కావాలనే మా నాన్నను టార్గెట్ చేశారని వెల్లడించారు.
నన్ను, మా నాన్నను బెదిరించారని వివరించారు. మా నాన్నపై దాడి చేసిని విషయంలో మేము పెట్టిన పిటిషన్ తీసుకోలేదన్నారు. దయచేసి మమ్మల్ని కాపాడండి అని వేడుకున్నారు.



Tipiri Thirupati @ Devuji @ Kumma dada, CCM & PBM | Malla Raji Reddy @ Sangram, CCM | Bade Chokka Rao @ Damodar @ Jagan, SCM & TSC Secretary | Nune Narsimha Reddy @ Ganganna @ Sannu dada, SCM

# మావోయిస్టు అగ్ర నేతల లొంగుబాటు

- ఒక్కొక్కరిపై రూ.25 లక్షల రివార్డ్
- కనుమరుగు కానున్న మావోయిస్ట్ ఉద్యమం

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మావోయిస్టు అగ్రనేతలు మంగళవారం తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఇందులో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు కాగా మరో ఇద్దరు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు. ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులపై తలా రూ. 25 లక్షల రివార్డు ఉండగా, మరో ఇద్దరు రాష్ట్ర కమిటీ సభ్యులపై తలా రూ. 20 లక్షల రివార్డు ఉంది. నలుగురూ ఒకేసారి లొంగిపోవడంతో తెలంగాణకు చెందిన లీడర్లు ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో ఇద్దరే ఉన్నారని డీజీపీ తెలిపారు. లొంగిపోయిన వారిలో కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పోలిట్‌బ్యూరో సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న ఉన్నారు.

## దశాబ్దాల అజ్ఞాత జీవితానికి స్వస్తి..

జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ 1978లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దాదాపు 44 సంవత్సరాలుగా అజ్ఞాత జీవితంలో ఉన్నారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబళ్ల కేశవరావు ఎన్‌కౌంటర్లో 2024 మే 21న మృతి చెందిన తర్వాత తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం శాస్త్రులపల్లి గ్రామానికి చెందిన మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ 1974లో రాడికల్ విద్యార్థి సంఘం ద్వారా పార్టీలోకి వెళ్లిపోయారు. దాదాపు 46 సంవత్సరాలుగా అజ్ఞాతజీవితం గడిపిన ఆయన ప్రస్తుతం పోలిట్‌బ్యూరో సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండల, కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ పదవ తరగతి చదువుతూనే 1996లో పార్టీలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. గుంటూరు జిల్లా కాకుమాను మండలం వల్లూరు గ్రామానికి చెందిన నూనె నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న జననాట్యమండలి ద్వారా 1990లో పార్టీలోకి వెళ్ళిపోయారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ఈ నలుగురూ ఒకేసారి తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోవడంతో ఇక మావోయిస్ట్ ల ఉద్యమం కనుమరుగైనట్లే భావిస్తున్నారు.

## గణపతి ఆచూకీ లభ్యం..

కొన్ని దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీని నడిపించిన అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ రావు ఆచూకీ లభ్యమైంది. గత కొన్నేళ్లుగా భారత్ పొరుగునున్న నేపాల్‌లో ఆయన మకాం వేశారు. తీవ్ర అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన నడవలేని పరిస్థితిలో ఉన్నారు. అయితే గణపతిని భారత్‌కు రప్పించేందుకు తెలంగాణ పోలీసులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లలో పలువురు అగ్రనేతలు సైతం మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే మావోయిస్టు అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావు పోలీసులకు చిక్కితే.. మావోయిస్టు పార్టీ చరిత్రగా మిగిలిపోయే అవకాశం ఉందనే ఒక చర్చ సాగుతోంది.



# డెస్క్ జర్నలిస్టుల ఆందోళన

☐ కలెక్టర్ కు వినతిపత్రం అందించిన నాయకులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట డెస్క్ జర్నలిస్టులు మంగళవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డెస్క్ జర్నలిస్ట్ లతో పాటు అన్ని విభాగాల్లో అక్రిడిటేషన్ కార్డులు తగ్గింపు చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలు ఆందోళనలకు పిలుపునిచ్చాయి. అందులో భాగంగానే హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో డెస్క్ జర్నలిస్ట్ లతో పాటుగా మిగతా యూనియన్ ల నాయకులు పాల్గొని తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యమంటూ నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం డెస్క్ జర్నలిస్టులకు గతంలో మాదిరిగానే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ స్నేహ శబరీష్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, బీఆర్ లెనిన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, మస్కపురి సుధాకర్, రాజ్ కుమార్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గడ్డం కేశవ మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, డెస్క్ జర్నలిస్టులు శంకేషి శంకర్ రావు, సీహెచ్ సోమనర్సయ్య, వర్దెల్లి లింగయ్య, అల్లం రాజేష్ వర్మ, నాయకులు కోరుకొప్పుల నరేందర్, బోల్ల అమర్, బొడిగె శ్రీనువాస్, సంపత్ రావు, కిరణ్ రెడ్డి, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, ఎం.సుధాకర్, శ్రీకాంత్, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com